సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం । 10 । జూలై । 2023



అందుబాటులో ఇంటర్

త్వరలో జిల్లాలోని ప్రతి మండలంలోనూ ప్రభుత్వ జూనియర్ కళాశాల అందుబాటులోకి రానుంది. 8లో



ఖరీదైన జబ్బులకూ చికిత్సలు

అనంతపురంలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి పేదలకు వరంలా మారింది. నాణ్యమైన చికిత్సలందిస్తోంది. 8లో

గరిష్టం/కనిష్టం 37.4°/21.8°

జిల్లాలో ఆదివారం పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం తగ్గింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో నేడు 'స్పందన'



పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తిలోని జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డివిజన్, మండల స్థాయిలో సైతం ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. వినతి పత్రాలపై ఆధార్ నంబర్, ఫోన్ నంబర్లు తప్పనిసరిగా పొందుపరచాలని సూచించారు.

ఎస్పీ కార్యాలయంలోనూ..

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం 'స్పందన' కార్యక్రమం ఉంటుంది. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ఆదివారం ప్రకటన విడుదలైంది. ప్రజలు తమ సమస్యలపై ఎస్పీకి నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.

ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు రీ అడ్మిషన్



డీవైఈఓ రఘునాథరెడ్డి

ప్రశాంతినిలయం: 2022–23 విద్యా సంవత్సరంలో ఫెయిలైన ఇంటర్ విద్యార్థుల రీ అడ్మిషన్‌కు ప్రభుత్వం అవకాశం ఇచ్చినట్లు డీవైఈఓ రఘునాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇంటర్ రెండో సంవత్సరంలో ఒకటి, రెండు, లేదా మూడు సబ్జెక్టుల్లో ఫెయిలైన విద్యార్థులు ఆయా సబ్జెక్టుల తరగతులకు హాజరు కావొచ్చన్నారు. తిరిగి పరీక్షలు రాయవచ్చని తెలిపారు. మూడు కన్నా ఎక్కువ సబ్జెక్టుల్లో ఫెయిలైనట్లయితే రెగ్యులర్ తరగతులకు హాజరు కావాలని సూచించారు. రీ అడ్మిషన్ పొందిన విద్యార్థులు థియరీ, ప్రాక్టికల్స్ పరీక్షల్లో గత సంవత్సరం పొందిన మార్కులను నిలుపుకునే వీలుంటుందన్నారు. విద్యార్థులు పరీక్ష, వార్షిక రుసుము చెల్లించాలని తెలిపారు.

మెనూ పక్కాగా అమలు

అనంతపురం రూరల్: నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్‌రావు ఆదేశించారు. అనంతపురంలోని ఎస్సీ వసతి గృహం–2ను ఆదివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థినులతో కలసి భోజనం చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ చక్కగా చదువుకోవాలన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ సహాయ అధికారి దామోదర్‌రెడ్డి తదితరులున్నారు.

'లక్ష'ణమైన సేవలు!

- సత్ఫలితాలిస్తున్న 'జగనన్న సురక్ష'
- జిల్లాలో 9 రోజుల్లోనే 1.63 లక్షల మంది నమోదు
- వారంలోనే 1,00,178 ధ్రువీకరణ పత్రాల అందజేత



పుట్టపర్తి మండలం పెదపల్లిలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఆర్డీఓ భాగ్యరేఖ, ప్రత్యేకాధికారి సుభదాస్

పుట్టపర్తి అర్బన్: 'జగనన్న సురక్ష' కార్యక్రమం జిల్లాలో శరవేగంగా కొనసాగుతోంది. జిల్లా అధికారులు, డివిజన్, నియోజకవర్గ, మండల ప్రత్యేకాధికారులు, ప్రజాప్రతినిధులు అవగాహన పెంపొందిస్తుండడంతో ప్రజలు క్యాంపులను సద్వినియోగం చేసుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా కేవలం తొమ్మిది రోజుల్లోనే అధికారులు, వలంటీర్లు 1,90,203 ఇళ్లను సందర్శించారు. అందులో 1,63,424 ఇళ్లలో సేవా సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారంటే కార్యక్రమం ఎంతటి సత్ఫలితాలిస్తోందో అర్థం చేసుకోవచ్చు. ఏ ఇంటికి వలంటీర్ వెళ్లినా ఆప్యాయంగా పలకరిస్తూ సేవలను పొందుతుండడం గమనార్హం.

11 రకాల సేవలు..

ప్రజలకు కావాల్సిన సర్టిఫికెట్లను ఉచితంగా అందించాలనే ఉద్దేశంతో 'జగనన్న సురక్ష'కు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కుల, ఆదాయ, జనన, మరణ సర్టిఫికెట్లు, మ్యుటేషన్లు, వివాహ ధ్రువీకరణ పత్రం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, ఆధార్‌కు మొబైల్ లింక్, కౌలు రైతులకు సీసీఆర్‌సీ సర్టిఫికెట్, కొత్త బియ్యం కార్డు, హౌస్ హోల్డ్ విభజన వంటి 11 రకాల సర్టిఫికెట్లలో ఏది కావాలన్నా పైసా కూడా వసూలు చేయకుండా ఇంటి వద్దకే అందజేయాలని ఆదేశించింది. జిల్లాలో ఇప్పటి వరకూ సరైన డాక్యుమెంట్లు అందజేసిన 1,00,178 మందికి సేవా సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. మిగిలిన 62,848 మందికి డాక్యుమెంట్లు అందజేసిన వెంటనే ధ్రుపత్రాలను అందించనున్నారు. జిల్లాలో 'జగనన్న సురక్ష' కార్యక్రమం మరో 20 రోజులు కొనసాగనుంది. గ్రామాలు, పట్టణాల్లోని ప్రతి ఇంటికీ వలంటీర్ వస్తారని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని అధికారులు తెలిపారు.

రెండు రోజుల్లోనే సర్టిఫికెట్



కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం రెండు రోజుల్లోనే వచ్చింది. మా ఇంటి వద్దకు వలంటీర్ వచ్చిన సందర్భంలో సర్టిఫికెట్ కావాలని అడిగా. గ్రామంలో నిర్వహించిన 'జగనన్న సురక్ష' సభకు పిలిచి మరీ సర్టిఫికెట్ అందజేశారు. ఉచితంగా ధ్రువపత్రం అందజేయడం చాలా సంతోషంగా ఉంది.

– నూర్‌బాషా, పెదపల్లి, పుట్టపర్తి మండలం

రూపాయి ఖర్చు చేయలేదు



ఒక్క రూపాయి ఖర్చు లేకుండానే నాకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ అందజేశారు. నిత్యం మా మధ్యనే ఉంటూ వలంటీర్ తలలో నాలుకలా మారారు. ప్రజల కోసం అద్భుతమైన కార్యక్రమాలు అమలు చేస్తున్న సీఎం జగన్‌కు ధన్యవాదాలు.

– శ్రీనివాస్‌నాయక్, పెద్దతండా

సద్వినియోగం చేసుకోవాలి



'జగనన్న సురక్ష' చాలా మంచి కార్యక్రమం. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. ఎటువంటి ఖర్చు లేకుండానే 11 రకాల సేవా సర్టిఫికెట్లు అందజేస్తున్నారు. డాక్యుమెంట్లు సమర్పించిన వెంటనే సర్టిఫికెట్ అందజేస్తారు. ఇందు కోసం ఏ అధికారి వద్దకూ వెళ్లాల్సిన పని లేదు. సిబ్బందికి ప్రజలు సహకరించాలి.

– అరుణ్‌బాబు, కలెక్టర్

అనూష అరంగేట్రం అదుర్స్



కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ నుంచి క్యాప్ అందుకుంటున్న అనూష

అనంతపురం/నార్పల: నార్పల మండలం బండ్లపల్లికి చెందిన బి.అనూష అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ అరంగేట్రం అదిరింది.ఆదివారం భారత్‌- బంగ్లాదేశ్ మధ్య టి–20 మ్యాచ్ బంగ్లాదేశ్‌లోని మిర్పూర్‌లో జరిగింది. మొదట బంగ్లాదేశ్ 20 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 114 పరుగులు చేసింది. అనూష నాలుగు ఓవర్లు వేసి 24 పరుగులు మాత్రమే ఇచ్చింది. ప్రత్యర్థులకు తన స్పిన్ బౌలింగ్‌తో చుక్కలు చూపించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ 16.2 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి 118 పరుగులు చేసి విజయం సాధించింది. తొలి మ్యాచ్‌లోనే భారత్ విజయం సాధించడం ఆనందంగా ఉందని అనూష 'సాక్షి'కి ఫోన్‌లో తెలిపింది. భారత మహిళా క్రికెట్ కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ నుంచి క్యాప్ అందుకున్నట్లు చెప్పింది. అనూష గ్రామం బండ్లపల్లిలో గ్రామస్తులు సంబరాలు చేసుకున్నారు.

కలెక్షన్ సెంటర్లకు ప్రోత్సాహం

- ఉద్యాన శాఖ కమిషనర్ శ్రీధర్



పనసపండ్ల ప్యాకింగ్‌ను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ కమిషనర్ శ్రీధర్, జిల్లా అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: పండ్లతోటల రైతులు పండించిన ఫలసాయానికి తగిన గిట్టుబాటు ధర లభించేలా కలెక్షన్ సెంటర్లను ప్రోత్సహిస్తున్నట్లు ఉద్యాన శాఖ కమిషనర్ శ్రీధర్ తెలిపారు. కమిషనర్ ఆదివారం అనంతపురం రూరల్ మండలంలో పర్యటించారు. తొలుత కక్కలపల్లిలో మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్ (ఎంఐడీహెచ్) కింద రాయితీతో గతంలో ఇచ్చిన మినిమం ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించారు. అక్కడ దానిమ్మ విత్తనాలను వేరుచేసి ప్యాకింగ్ చేయడం, పనస, చెరకు గడలు, పచ్చికొబ్బెరను వేరుచేసి చిన్నపాటి ప్యాకింగ్ చేసి మాల్స్, ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్న విషయాన్ని నిర్వాహకుడు శ్రవణ్‌కుమార్ వివరించారు. అక్కడే రూ.12.50 లక్షల విలువ చేసే కోల్డ్‌రూం నిర్మాణాన్ని కమిషనర్ ప్రారంభించారు. ఇందుకు రూ.9 లక్షల వరకు రాయితీ వర్తిస్తుందన్నారు. అనంతరం కాటిగానికాలువలో కలెక్షన్ సెంటర్‌ను పరిశీలించి రైతు భాస్కర్‌తో వివరాలు ఆరా తీశారు. కలెక్షన్ సెంటర్ల ఏర్పాటుకు ముందుకు వచ్చే రైతు, మహిళా గ్రూపులకు రూ.15 లక్షల యూనిట్ విలువలో 75 శాతం రాయితీ ఇస్తామని తెలిపారు. వీటితో పాటు రైతులకు ఉపయోగపడేలా ఉద్యాన పథకాల అమలుకు ప్రాధాన్యత ఇస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కమిషనర్ వెంట రెండు జిల్లాల ఉద్యానశాఖ అధికారులు బి.రఘునాథరెడ్డి, జి.చంద్రశేఖర్, ఏపీఎంఐపీ అధికారులు జి.ఫిరోజ్‌ఖాన్, సుదర్శన్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

హాస్టళ్లకు సరుకుల సరఫరాకు టెండర్ల స్వీకరణ

ప్రశాంతినిలయం: జిల్లాలోని సాంఘిక, గిరిజన, బీసీ సంక్షేమ శాఖల పరిధిలోని వసతి గృహాలకు నిత్యావసర సరుకులు, కోడి గుడ్లు, కోడి మాంసం సరఫరాకు టెండర్ల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ సాధికారత అధికారి శివరంగ ప్రసాద్ ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ కార్యాలయంలో టెండర్ ఫారాలను అన్ని పనిదినాలలో పొందవచ్చు. ఈ నెల 12లోపు టెండర్లు దాఖలు చేయాలి.

'పురం'లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దాం

- చుట్టపుచూపుగా వచ్చే ఎమ్మెల్యే బాలకృష్ణకు ప్రజలే బుద్ధి చెప్పాలి
- పార్టీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త దీపిక పిలుపు
- ఘన స్వాగతం పలికిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



హిందూపురంలోని అంబేడ్కర్‌సర్కిల్‌లో దీపికను గజమాలలతో సత్కరిస్తున్న నాయకులు



నాయకులు బహూకరించిన గొర్రె పిల్లతో దీపిక

హిందూపురం: వచ్చే ఎన్నికల్లో హిందూపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించి పార్టీ జెండా ఎగరేద్దామని నియోజకవర్గ సమన్వయకర్త దీపిక పిలుపునిచ్చారు. సమన్వయకర్తగా నియమితులయ్యాక తొలిసారిగా ఆదివారం హిందూపురం వచ్చిన ఆమెకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. తూమకుంట చెక్‌పోస్టు నుంచి హిందూపురం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక మెయిన్ బజారు గాంధీ సర్కిల్ వద్ద గజమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులనుద్దేశించి దీపిక మాట్లాడారు. ఎమ్మెల్యేగా గెలిచిన బాలకృష్ణ నియోజకవర్గ ప్రజల సమస్యలను గాలికొదిలేశారని విమర్శించారు. చుట్టపుచూపుగా వస్తూ వెళ్తూ ఓటరు తీర్పును అపహాస్యం చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయనకు బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. పార్టీ నాయకులు, ప్రజలకు రుణపడి ఉంటానని, హిందూపురం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. హిందూపురం సమన్వయకర్తగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ నాయకులందర్ని కలుపుకుని ముందుకు సాగుతానన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయంగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. వై నాట్ 175 అన్న జగనన్న నినాదాన్ని నిజం చేద్దామన్నారు. నాయకుల ఆప్యాయత, ఆశీర్వాదాలు ఎల్లవేళలా తనపై ఉండాలని కోరారు. త్వరలోనే పార్టీ నాయకులతో కలిసి ప్రజలతో మమేకమవుతానని తెలిపారు. సంక్షేమ పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిద్దామన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా జగనన్న చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. అందరికీ సమన్యాయం చేయడం ఆయనతోనే సాధ్యమైందన్నారు. జగనన్న ఆశయాలకు అనుగుణంగా నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పక్షపాతి అన్నారు. మైనార్టీల సంక్షేమానికి 4 శాతం రిజర్వేషన్ కల్పించి వైఎస్సార్ ఎంతో మేలు చేశారని తెలిపారు. తండ్రిని మించి సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. చంద్రబాబు మళ్లీ కళ్లబొల్లి మాటలు చెబుతూ ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఆయన్ను నమ్మరాదని సూచించారు. రాజకీయ నాయకుడికి ఉండాల్సిన లక్షణాల్లో పవన్ కల్యాణ్‌కు ఒక్కటి కూడా లేవని దుయ్యబట్టారు. ఎమ్మెల్యే బాలకృష్ణకు హిందూపురం ప్రజల గురించి ఆలోచించే టైం లేదని ఎద్దేవా చేశారు. దీపికకు మనందరి మద్దతు అందిద్దామని పిలుపునిచ్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, కౌన్సిలర్లు శివ, షాజియాలు మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా ముందుకుపోదామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి, పెనుకొండ మాజీ సమన్వయకర్త నాగలూరు బాబురెడ్డి, కౌన్సిలర్లు మారుతిరెడ్డి, ఆసీఫ్, రామచంద్ర, గిరి, జయప్ప, పురుషురాం, నాగేంద్రబాబు, రోషన్, పార్వతీ, నాగేంద్రమ్మ, రహమత్ బీ, ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు ఉపేంద్రరెడ్డి, నాగమణి, జనార్దన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, మండల కన్వీనర్ నారాయణస్వామి, వైస్ ఎంపీపీ అంజన్‌రెడ్డి, జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి, నక్కలపల్లి శ్రీరామిరెడ్డి, సర్పంచ్‌లు శంకర్‌రెడ్డి, నాగరత్నమ్మ, నాయకులు డిష్ నాగరాజు, మహేష్, చంద్రశేఖర్, అబీబ్, ఆనంద్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, తిమ్మిరెడ్డి, పెద్ద ఎత్తున కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చారిత్రక శాసనాలు కాపాడండి



కోట నిర్మాణ శాసనాన్ని చూపుతున్న మైనాస్వామి

పెనుకొండ: విజయనగర రాజుల కాలంలో ముఖ్య భూమిక పోషించిన పెనుకొండ కోట నిర్మాణానికి సంబంధించిన శాసనాలను కాపాడాలని చరిత్రకారుడు మైనాస్వామి కోరారు. పట్టణంలోని రాచరికపు చరిత్రను చాటి చెప్పే శాసనాలు, కోట ఉత్తర ద్వార పరిసరాలను ఆదివారం ఆయన పరిశీలించి, మాట్లాడారు. గత చరిత్రకు ప్రత్యక్ష సాక్షిగా ఉన్న శాసనం పగిలిపోవడం ఎంతో బాధాకరమన్నారు. కోట ఉత్తర ద్వార ప్రవేశం లోపలి వైపు దిమ్మెపై ఉన్న ఆ శాసనానికి, కోట భాగానికి తక్షణం మరమ్మతులు చేపట్టాలే చర్యలు తీసుకోవాలని భారత పురావస్తు శాఖ అధికారులను కోరుతూ ఎఎస్ఐ డైరెక్టర్ జనరల్‌కు లేఖ రాయనున్నట్లు తెలిపారు.

ఖరీదైన జబ్బులు.. ఉచిత చికిత్సలు



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని కార్డియాలజీ ఐసీయూ

- పేదలకు అందుబాటులో సూపర్ స్పెషాలిటీ వైద్యం
- కార్పొరేట్ ఆస్పత్రిని తలదన్నేలా ఏడు రకాల నాణ్యమైన చికిత్సలు

అనంతపురం క్రైం: గత టీడీపీ ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేసింది. దీని ఫలితంగా చిన్నపాటి సమస్యకు పక్క జిల్లా కర్నూలు లేకపోతే హైదరాబాద్, బెంగళూరుకు రోగులు పరుగులు తీయాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రభుత్వ సర్వజనాస్పత్రిని బలోపేతం చేయడమే కాకుండా అత్యున్నత ప్రమాణాలతో కూడిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకువచ్చింది. ఫలితంగా పేద, సామాన్య మధ్య తరగతి ప్రజలకు రూ.లక్షలతో కూడుకున్న సూపర్ స్పెషాలిటీ వైద్యం ఉచితంగా అందుతోంది. న్యూరో సర్జరీ, కార్డియాలజీ, న్యూరాలజీ, ఎండో క్రైనాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీతో కలుపుకుని మొత్తం 7 రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రతి సోమ, గురువారాల్లో న్యూరో, గ్యాస్ట్రో, మంగళ, శుక్రవారాల్లో కార్డియాలజీ, న్యూరాలజీ, బుధ, శనివారాల్లో మెడికల్ గ్యాస్ట్రో, నెఫ్రాలజీ, ఎండోక్రైనాలజీ ఓపీ సేవలుంటాయి.

ఓపీ సేవల నుంచి ప్రధాన సర్జరీల వరకూ..

గతేడాది ఏప్రిల్ 18 నుంచి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఓపీ సేవలు మొదలయ్యాయి. ఇప్పటి వరకూ ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు కర్నూలు ఇతర ప్రాంతాల నుంచి 29,850 మంది రోగులు ఏడు రకాల అత్యున్నత వైద్య సేవలు పొందారు. 2022, మే 24 నుంచి సర్జరీలకు శ్రీకారం చుట్టగా, అప్పటి నుంచి ఇప్పటి వరకూ చేపట్టిన అన్ని ఆపరేషన్లూ విజయవంతం కావడం గమనార్హం. ప్రధానంగా న్యూరో సర్జరీ, కార్డియాలజీ(గుండె) శస్త్ర చికిత్సలు వేగం పుంజుకున్నాయి. న్యూరో సర్జరీకి సంబంధించి ఇప్పటి వరకూ 11,854 మందికి ఓపీ, 447 మందికి శస్త్రచికిత్సలు చేశారు. ఇందులో ప్రధాన శస్త్రచికిత్సలు 221 కాగా, మరో 226 కేసులకు మైనర్ శస్త్రచికిత్స చేశారు. కార్డియాలజీకి సంబంధించి 3,433 మంది ఓపీ సేవలు అందుకోగా, 215 శస్త్రచికిత్సలు జరిగాయి.

కార్పొరేట్‌ను తలదన్నేలా..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అత్యున్నత ప్రమాణాలతో కార్పొరేట్ ఆస్పత్రులను తలదన్నేలా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని తీర్చిదిద్దారు. అత్యాధునిక క్యాథ్‌ల్యాబ్, ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూలు, 200 పడకలు ఏర్పాటు చేశారు. కార్డియాలజీ, న్యూరో, యూరాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, నెఫ్రాలజీలకు మొత్తం 5 ఐసీయూలున్నాయి. న్యూరో, యూరాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీలకు ఆరు ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయి. వీటితో పాటు వివిధ రకాల రక్త పరీక్షలు, ఫార్మసీ, అల్ట్రాసౌండ్, డాప్లర్, ఎక్స్‌రే, సిటీ స్కాన్ తదితర సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు.



బెడ్‌పై ఉన్న ఈమె పేరు నాగమ్మ. ఆత్మకూరు మండలం పంపనూరు గ్రామం. వెన్నుపూస అరిగి నరాలపై ఒత్తిడి నెలకొనడంతో నడవలేక ఇబ్బంది పడుతుండేది. పెద్ద పెద్ద నగరాల్లోని ప్రముఖ ప్రైవేట్ ఆస్పత్రుల చుట్టూ తిరిగినా నయం కాలేదు. దీంతో ఈ నెల 3న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేరడంతో 7వ తేదీ న్యూరోసర్జరీ విభాగాధిపతి డాక్టర్ భాస్కర్ బృందం ఆమెకు శస్త్రచికిత్స చేశారు. ఈ తరహా ఆపరేషన్‌కు ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.లక్ష వరకు తీసుకుంటారు. అయితే ఖరీదైన శస్త్రచికిత్సను వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద సూపర్ స్పెషాలిటీ వైద్యులు ఉచితంగా చేశారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటోంది. కూలినాలీ చేసుకుని బతుకీడుస్తున్న తమలాంటి వారి కోసం ఇంత పెద్ద ఆస్పత్రిని నిర్మించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని ఈ సందర్భంగా నాగమ్మ భర్త మీటేనాయక్ అన్నారు. పైసా ఖర్చు లేకుండా తన భార్యను మామూలు మనిషిగా మార్చిన వైద్యులకు, ఇందుకు దోహదపడిన ప్రభుత్వానికి రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్య సేవలు ఇలా..	
మొత్తం వైద్య సేవలు	8
ప్రస్తుతం అందుబాటులో ఉన్న సేవలు	7
ఓపీ సేవల ప్రారంభం	2022, ఏప్రిల్ 18
సర్జరీలు ప్రారంభం	2022, మే 24
ఇప్పటి వరకూ ఓపీ సేవలు అందుకున్న వారి సంఖ్య	29,850 మంది

సమష్టి కృషితోనే ఉత్తమ ఫలితాలు

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని వైద్యులు, సిబ్బంది సమష్టి కృషితో అతి తక్కువ కాలంలోనే మెరుగైన ఫలితాలు అందుకోగలిగాం. ముఖ్యంగా న్యూరో, కార్డియాక్ సేవలకు మంచి స్పందన ఉంది. జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి రోగులు వస్తున్నారు. రానున్న రోజుల్లో మరింత మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తాం.

– డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, సూపరింటెండెంట్, జీజీహెచ్

సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం



డ్రైవింగ్ వృత్తితో జీవనం సాగిస్తున్న నాకు గత నెల 27న ఛాతి నొప్పి వచ్చింది. కుటుంబసభ్యులు వెంటనే సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స తర్వాత అదే రోజు ఉదయం 12 గంటలకు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. అదే రోజు సాయంత్రం నాకు ఆపరేషన్ చేసి, ప్రాణాలు కాపాడారు. ఈ ఆపరేషన్‌కు ప్రైవేట్ ఆస్పత్రుల్లో అయితే రూ.2 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిసింది. నాలాంటి సామాన్యుడికి అంత డబ్బు పెట్టి ఆపరేషన్ చేయించుకునే పరిస్థితి ఎక్కడుంటుంది. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి లేకుంటే నా పెళ్లాం, బిడ్డల పరిస్థితి ఏమిటో తలుచుకుంటే ఇప్పటికీ భయమేస్తోంది. ఇంత పెద్ద ఆస్పత్రిని మా బోటి వారి కోసం ఏర్పాటు చేసిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– ఉమర్ షరీఫ్, లక్ష్మీనగర్, అనంతపురం

చెలరేగిన బ్యాటర్లు



సంజయ్‌నాయుడు



గిరినాథ్

అనంతపురం: సౌత్ జోన్ అంతర జిల్లాల సీనియర్ మల్టీ డే క్రికెట్ టోర్నీ మూడో రౌండ్ పోటీల్లో బ్యాటర్లు చెలరేగారు. అనంత క్రీడాగ్రామం వేదికగా అనంతపురం క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టోర్నీ ఆదివారం ప్రారంభమైంది. తొలి రోజు అనంతపురం - నెల్లూరు, కడప - కర్నూలు జట్ల మధ్య మ్యాచ్‌లో జరిగాయి. అనంతపురం -నెల్లూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 90 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 272 పరుగులు చేసింది. ఎస్.రేవంత్ రెడ్డి 97 పరుగులు, పి. సుబ్రహ్మణ్యం (70 బంతుల్లో 135 పరుగులు) సాధించారు. అలాగే కర్నూలు- వైఎస్సార్ జిల్లా మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత కర్నూలు జట్టు బ్యాటింగ్ చేసింది. 90 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 371 పరుగులు భారీ స్కోరు చేసింది. వి.సంజయ్‌నాయుడు 193 బంతుల్లో 14 ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 119 పరుగులు సాధించాడు. మరో బ్యాటర్ యుఎంఎస్ గిరినాథ్ 12 ఫోర్లతో 101 పరుగులతో అద్భుతమైన భాగస్వామ్యాన్ని అందించాడు.

వెల్డింగ్ షాపులో అగ్నిప్రమాదం

- పాక్షికంగా దగ్ధమైన టిప్పర్



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మడకశిర: స్థానిక పావగడ రోడ్డులో ఉన్న ఓ వెల్డింగ్ షాపు వద్ద ఆదివారం సాయంకాలం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. వైఎస్సార్ జిల్లా కడపకు చెందిన ఓ టిప్పర్‌కు వెల్డింగ్ చేస్తుండగా మంటలు చెలరేగి వాహనాన్ని చుట్టుముట్టాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు ఆర్పేలోపు టిప్పర్ పాక్షికంగా దగ్ధమైంది. ఘటనలో దాదాపు రూ.20 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు ఫైర్ ఆఫీసర్ విజయకుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

బత్తలపల్లి: విద్యుత్ లైన్ లాగుతుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బత్తలపల్లికి చెందిన నసీం అహమ్మద్ అలియాస్ ఢిల్లీ మెకానిక్ (43)కు భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బత్తలపల్లికి చెందిన తన స్నేహితుడు మంజుల వెంకటనారాయణ.. విశ్వనాథపురం వద్ద తన పొలానికి ఆదివారం కరెంట్ లైను లాగుతుండడంతో ఆ పనుల్లో పాలు పంచుకున్నాడు. మంజుల చందు, మంజుల వెంకటనారాయణ విద్యుత్ లైన్ లాగుతుండగా దానికి ఉపరితలంలో ఉన్న ప్రధాన లైన్‌కు తీగలు తగలడంతో షాక్‌కు గురయ్యారు. విషయాన్ని గమనించిన నసీం అహమ్మద్ వెంటనే వారిని కాపాడేందుకు ప్రయత్నిస్తూ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. వడ్డె మంజుల వెంకటనారాయణ, మంజుల చందుకు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కాగా, విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప, సీపీఐ మండల కార్యదర్శి బండల వెంకటేష్ తదితరులు ఆర్డీటీ ఆస్పత్రికి చేరుకుని నసీం అహమ్మద్ మృతదేహానికి నివాళులర్పించారు. క్షతగాత్రులను పరామర్శించి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు.

'మ్యాప్ రీడింగ్'పై శిక్షణ

కూడేరు: దేశ సరిహద్దులో శత్రువుల కదలికలు గుర్తించాలన్నా, సైనికులు ఒక చోట నుంచి మరొక చోటికి సులువుగా వెళ్లాలన్నా మ్యాప్ రీడింగ్ కీలకమని ఎన్‌సీసీ క్యాడెట్లకు ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్లు కల్నల్ వైవీకే చైతన్య రెడ్డి, అక్షయ్ మాథూర్ సూచించారు. కూడేరు మండలం బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో ఆంధ్రా వన్ సీఏటీసీ-2 క్యాడెట్ల శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. శిక్షణకు నంద్యాల, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన 508 మంది క్యాడెట్లు హాజరయ్యారు. ఆదివారం ఉదయం మ్యాప్ రీడింగ్, శత్రువులు ఎంత దూరంలో ఉన్నారో దిక్సూచి(కంపాస్) ద్వారా తెలుసుకోవడం, అడ్డంకులను అధిగమిస్తూ ముందుకు వెళ్లడం (ఆప్టికల్)పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు రుద్ర తాపా, పవన్, దేవేంద్ర, ఎస్ఎస్ రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



దిక్సూచిపై శిక్షణ పొందుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

చేనేతలకు అండగా ప్రభుత్వం

- బాధిత చేనేతలను ఆదుకోవడంలో సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే కేతిరెడ్డి చొరవ ప్రశంసనీయం
- విలేకరుల సమావేశంలో ధర్మవరం పట్టు వ్యాపారులు



సమావేశంలో మాట్లాడుతున్న పట్టు వ్యాపారులు

ధర్మవరం: చేనేతలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం నిలిచిందని ధర్మవరానికి చెందిన పట్టు వ్యాపారులు అన్నారు. ఆదివారం స్థానిక శమీనారాయణ స్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోధర్మవరం పట్టు వ్యాపారులు గిర్రాజు నగేష్, పల్లెం వేణుగోపాల్, గిర్రాజు శశి, కోటం రవి, కోటం ఆనంద్, గడ్డం శ్రీనివాస్, పోలా వెంకటనారాయణ మాట్లాడారు. విజయవాడలో పట్టు వ్యాపారులపై చోటు చేసుకున్న ఘటన యావత్ పట్టు వ్యాపారులను దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఈ అంశం తెలియగానే బాధితులకు అండగా ఎమ్మెల్యే కేతిరెడ్డి నిలిచి, స్వయంగా పోలీసులకు ఫిర్యాదు చేయించడమే కాక, నిందితుడిని అరెస్ట్ చేయించి, రిమాండ్‌కు తరలించేలా చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. పట్టు వ్యాపారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఇటీవల కళ్యాణదుర్గం పర్యటనకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తీసుకెళితే.. సత్వర పరిష్కారానికి అధికారులను ఆదేశించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లో పట్టు వ్యాపారులపై దాడి ఘటనలు పునరావృతం కాకుండా ధర్మవరంలో అందరూ కలసి ఐక్యంగా ఓ యూనియన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. సోమవారం ఉదయం శమీ నారాయణస్వామి ఆలయం వద్దకు పట్టు వ్యాపారులంతా తరలి రావాలని పిలుపునిచ్చారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

రాప్తాడు: రైలు ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... బ్రహ్మసముద్రం మండలం యరడికెర గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్ (23) అనంతపురానికి వలస వచ్చి ఓ క్యాటరింగ్ సెంటర్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రైలు వస్తున్న విషయం గమనించకుండా పట్టాలు దాటేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచార అందుకున్న ధర్మవరం రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.



పూర్వ విద్యార్థులతో నాటి గురువు అశ్వత్థరెడ్డి

అపూర్వ సమ్మేళనం

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1986-87 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. వివిధ వృత్తులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల్లో స్థిరపడిన 45 మంది పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. తమ గత స్మృతులను నెమరువేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తాము చదువుకున్న పాఠశాలలో కలియ తిరిగి తమ అనుబంధాలను స్మరించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన నాటి గురువు అశ్వత్థరెడ్డిని ఘనంగా సన్మానించారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమ వంతు సాయం అందించాలని తీర్మానించారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగార్జునుడు, పద్మావతి, బాబావలి, మధుసూదన్ రెడ్డి, రవి, నరేంద్ర, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో 'ఇంటర్'

- ప్రతి మండలంలోనూ జూనియర్ కళాశాల
- గ్రామీణ విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని సీఎం నిర్ణయం
- పైలట్ ప్రాజెక్టుగా ఉమ్మడి జిల్లాలోని 15 మండలాల్లో అమలు
- ఆయా మండలాల్లో విద్యార్థులు, మౌలిక వసతులపై ఆరా

రాప్తాడురూరల్: పదో తరగతి పూర్తయిన బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు పలువురు ఇంటర్ చదువులకు బయట ప్రాంతాలకు వెళ్లడం లేదు. ఆర్థికభారం, సొంత ఊరిలో ఇంటర్ చదువు అందుబాటులో లేకపోవడం ప్రధానకారణం. మరోవైపు భద్రత దృష్ట్యా కిలోమీటర్ల దూరంలో ఉన్న జూనియర్ కళాశాలలకు ఆడపిల్లలను పంపేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. ముఖ్యంగా కూలీనాలి చేసుకునే కుటుంబాల్లో ఆడ పిల్లలను పదో తరగతికే చదువు చాలిస్తున్నారు. ఈ పరిస్థితులను గమనించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి మండలంలోనూ ఉన్నత పాఠశాలల్లోనే ప్లస్ టూ జూనియర్ కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఒక బాలికల జూనియర్ కళాశాల, మరొకటి కో ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసేలా నిర్ణయించారు. ఆయా కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులు అందుబాటులోకి తేనున్నారు. తొలుత పైలట్ ప్రాజెక్ట్‌గా ఉమ్మడి అనంతపురం జిల్లాలో 15 మండలాలను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన స్కూళ్లలో ప్లస్ టూకు అవసరమైన మౌలిక వసతులపై ప్రభుత్వం ఆరా తీసింది. ఇందులో భాగంగా ఆయా స్కూళ్లలో 6-10 తరగతుల విద్యార్థుల సంఖ్య, విస్తీర్ణం, అందుబాటులో ఉన్న తరగతి గదులు, ల్యాబ్ సదుపాయం ఉందా? లేదా? అని అడిగారు. ఈ వివరాలన్నీ రెండు జిల్లాల విద్యాశాఖ అధికారులు పంపారు.



కూడేరు జెడ్పీ హైస్కూల్

ప్లస్ టు కళాశాలల కోసం ఎంపిక చేసిన స్కూళ్లు.. అనంతపురం జిల్లాలో..

జెడ్పీహెచ్ఎస్ బ్రహ్మసముద్రం, జెడ్పీహెచ్ఎస్ వేపులపర్తి, జెడ్పీహెచ్ఎస్ బుక్కరాయసముద్రం, జెడ్పీహెచ్ఎస్ రోటరీపురం, జెడ్పీహెచ్ఎస్ గుమ్మఘట్ట, జెడ్పీహెచ్ఎస్ గొల్లపల్లి, జెడ్పీహెచ్ఎస్ కూడేరు, జెడ్పీహెచ్ఎస్ జల్లిపల్లి, జెడ్పీహెచ్ఎస్ పెద్దవడుగూరు, జెడ్పీహెచ్ఎస్ క్రిష్టిపాడు.

శ్రీసత్యసాయి జిల్లాలో..

ప్రభుత్వ స్కూల్ కదిరి, ఎంపీఎల్‌హెచ్ఎస్ కుటాగుళ్ల, జెడ్పీహెచ్ఎస్ బత్తలపల్లి, జెడ్పీహెచ్ఎస్ (బాలికలు) బత్తలపల్లి, జెడ్పీహెచ్ఎస్ బుక్కపట్నం, జెడ్పీహెచ్ఎస్ (బాలికలు) బుక్కపట్నం, జెడ్పీహెచ్ఎస్ గాండ్లపెంట, జెడ్పీహెచ్ఎస్ కటారుపల్లి, జెడ్పీహెచ్ఎస్ గోరంట్ల, జెడ్పీహెచ్ఎస్ (బాలికలు) గోరంట్ల, జెడ్పీహెచ్ఎస్ ఎన్‌పీ కుంట, జెడ్పీహెచ్ఎస్ గూటిబైలు, జెడ్పీహెచ్ఎస్ ఓడీ చెరువు, జెడ్పీహెచ్ఎస్ కొండకమర్ల, జెడ్పీహెచ్ఎస్ పరిగి, జెడ్పీహెచ్ఎస్ సేవామందిర్, జెడ్పీహెచ్ఎస్ రొళ్ల, జెడ్పీహెచ్ఎస్ అలుపనపల్లి, జెడ్పీహెచ్ఎస్ సోమందేపల్లి, జెడ్పీహెచ్ఎస్ చాలకూరు.